

కరుడుగట్టిన నేరస్తుడి అరెస్ట్

జీవిత ఖైదు అనుభవిస్తూ పెరోల్‌పై బయటకు వచ్చి తిరిగి నేరాలకు పాల్పడుతున్న వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు.

- 8లో ▸



కనీస వేతనం చెల్లించాలి

కనీస వేతనం చెల్లించాలని, హెల్త్ కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఆశా కార్యకర్తలు సమ్మె బాట పట్టారు.

- 9లో ▸


గరిష్టం/కనిష్టం
33.6 /21.3

వాతావరణం

ఉదయం ఆహ్లాదకరంగా ఉంటుంది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. అక్కడక్కడ జల్లులు కురిసే అవకాశాలు ఉన్నాయి.

నిమజ్జనానికి వేళాయె!

- జిల్లాకేంద్రంలో నేడు వినాయక విగ్రహాల నిమజ్జనోత్సవం ప్రారంభం
- ఏర్పాట్లు చేసిన అధికారులు
- రెండు రోజుల పాటు సాగనున్న శోభాయాత్ర



కామారెడ్డిలో శోభాయాత్ర రూట్ మ్యాప్


విగ్రహాలను నిమజ్జనం చేసే స్థలంలో చదును చేస్తున్న దృశ్యం

వినాయక చవితి పండుగతో ప్రారంభమైన నవరాత్రి ఉత్సవాలు ముగింపు దశకు చేరుకున్నాయి. నవరాత్రులు ఘనమైన పూజలందుకున్న గణపయ్య.. గంగమ్మ ఒడికి చేరే సమయం ఆసన్నమైంది. జిల్లాకేంద్రంలో బుధవారం నిమజ్జనోత్సవ శోభాయాత్ర ప్రారంభం కానుంది. రెండు రోజులపాటు కనుల పండువగా సాగే శోభాయాత్రకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు.

– కామారెడ్డి టౌన్


టేక్రియాల్ చెరువు వద్ద కంట్రోల్ రూం

నిమజ్జన ఏర్పాట్లు పూర్తి

టేక్రియాల్ చెరువు వద్ద మున్సిపాలిటీ ఆధ్వర్యంలో నాలుగు భారీ క్రెయిన్‌లు, డోజర్‌ను ఏర్పాటు చేశారు. విగ్రహాలను ఈ క్రేన్ ద్వారా చెరువుల్లోకి దింపి నిమజ్జనం చేస్తారు. చెరువులోకి ఎవరూ వెళ్లకుండా బారికేడ్లు ఏర్పాటు చేశారు. సానిటేషన్ కార్యాలయం, మున్సిపాలిటీ, టేక్రియాల్ చెరువు వద్ద ప్రత్యేకంగా సహాయక కేంద్రాలను అందుబాటులో ఉంచారు. ఎస్పీ ఆధ్వర్యంలో ముగ్గురు డీఎస్పీలు, సీఐలు, ఎస్సైలు, ఏఎస్సైలు, సీఆర్‌పీఎఫ్ పోలీసులతో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. విద్యుత్‌శాఖ ఆధ్వర్యంలో విద్యుత్ వైర్లు బాగుచేయడంతోపాటు ఎలాంటి ప్రమాదాలు జరగకుండా సిబ్బందిని నియమించారు. నిమజ్జనోత్సవ శోభాయాత్రను రెవెన్యూ అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించనున్నారు.

కామారెడ్డిలో వినాయక నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతాయి. మండపాలలో భారీ గణేశుడి విగ్రహాలను ప్రతిష్ఠించడమే కాదు.. అంతే భారీగా సెట్టింగ్‌లు ఏర్పాటు చేస్తారు. శోభాయాత్ర సైతం వైభవంగా సాగుతుంది. రెండురోజులపాటు సాగే శోభాయాత్రను వీక్షించడానికి సమీప గ్రామాల ప్రజలే కాదు.. చుట్టుపక్కల జిల్లాల భక్తులూ వేలాదిగా తరలివస్తారు. జిల్లా కేంద్రంలో 400లకుపైగా వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించారు. విగ్రహాల నిమజ్జనోత్సవం బుధవారం ప్రారంభమై గురువారం వరకు సాగనుంది. శోభాయాత్ర కోసం అధికారులు ఏర్పాట్లు చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేయగా.. మున్సిపల్, రెవెన్యూ శాఖల అధికారులు మిగతా ఏర్పాట్లు చేశారు. బుధవారం సాయంత్రం సిరిసిల్లరోడ్‌లోని ధర్మశాల వద్ద ప్రభుత్వ విప్ గంపగోవర్ధన్, కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి శోభాయాత్రను ప్రారంభించనున్నారు.

జాగ్రత్తలు పాటిద్దాం..

- నిమజ్జనం రోజున ఎలాంటి ప్రమాదాలు, అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జాగ్రత్తలు పాటించాలని అధికారులు సూచిస్తున్నారు. వారు సూచిస్తున్న జాగ్రత్తలు..
- శోభాయాత్రలో డీజే సౌండ్‌కు అనుమతి లేదు. డీజే పెడితే స్వాధీనం చేసుకుని చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని పోలీసులు ప్రకటించారు.
- శోభాయాత్రలో పాల్గొనే వాహనాల కండిషన్‌ను ముందుగానే సరిచూసుకోవాలి. అనుభవజ్ఞులైన డ్రైవర్‌లను ఎంపిక చేసుకోవాలి.
- వాహనంలో వినాయక విగ్రహాన్ని ఎక్కించేటప్పుడు, చెరువులో నిమజ్జనం చేసే సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలి.
- శోభాయాత్రలో టపాకాయలు పేల్చరాదు.
- విద్యుత్ తీగలతో జాగ్రత్తగా ఉండాలి. తడి చేతులతో, కర్రలతో కరెంట్ తీగలను తాకరాదు. జనరేటర్‌లు ఏర్పాట్లు చేసుకోవడం ఉత్తమం.
- మద్యం సేవించి నృత్యాలు చేయరాదు. ప్రార్థన మందిరాల వద్ద రెచ్చగొట్టే విధంగా ప్రవర్తించవద్దు.
- భారీ విగ్రహాలను తరలించే వాహనాల్లో చిన్నపిల్లలను ఎక్కించకపోవడం శ్రేయస్కరం.
- విగ్రహాల నిమజ్జనం కోసం చెరువు లోపలికి ఎవరూ వెళ్లకూడదు. క్రేన్‌ల సాయంతోనే విగ్రహాలను నిమజ్జనం చేయాలి.

శోభాయాత్ర సాగుతుందిలా..

శోభాయాత్రకు సంబంధించిన రూట్ మ్యాప్‌ను అధికారులు విడుదల చేశారు. రైల్వే స్టేషన్‌లోని యువజన సమాఖ్య వినాయకుడి నిమజ్జనోత్సవ శోభాయాత్ర ధర్మశాల వద్ద ప్రారంభం అవుతుంది. అక్కడి నుంచి వచ్చే వినాయక మండపాల నిర్వాహకులను సిరిసిల్లరోడ్‌లోని ఇందిరాచౌక్ వద్ద వీహెచ్‌పీ ఆధ్వర్యంలో సన్మానిస్తారు. అక్కడి నుంచి స్టేషన్‌రోడ్, సుభాష్‌రోడ్, తిలక్‌రోడ్, జేపీఎన్ చౌరస్తా, పాంచ్‌రస్తా, గోపాలస్వామిరోడ్, పెద్దబజార్, రైల్వేబ్రిడ్జి, అంబేడ్కర్ విగ్రహం, నిజాంసాగర్ చౌరస్తా, కొత్త బస్టాండ్ మీదుగా టేక్రియాల్ చెరువు వరకు శోభాయాత్ర సాగనుంది. చెరువుల్లో వినాయకులను నిమజ్జనం చేస్తారు. మరికొందరు బాసరకు తీసుకువెళ్తారు.


టేక్రియాల్ చెరువు వద్ద ఏర్పాటు చేసిన బారికేడ్లు

న్యూస్‌రీల్

పోలింగ్ కేంద్రాల పరిశీలన



ఎల్లారెడ్డి: వెంకటాపూర్‌లోని పోలింగ్ కేంద్రాన్ని రాష్ట్ర ఎలక్ట్రోరల్ అబ్జర్వర్ క్రిస్టీనా జెడ్ చోంగ్తూ మంగళవారం పరిశీలించారు. పోలింగ్ బూత్ పరిధిలోని ఓటర్లు, ఇటీవల వచ్చిన దరఖాస్తుల వివరాలను తెలుసుకున్నారు. పోలింగ్ కేంద్రంలో సౌకర్యాలను పరిశీలించారు. ఆమె వెంట కలెక్టర్ జితేష్ వి పాటిల్, అడిషనల్ కలెక్టర్ మను చౌదరి, ఆర్డీవో ప్రభాకర్, తహసీల్దార్ సురేష్, బీఎల్‌వో రాజు తదితరులున్నారు.

ఎర్రాపహాడ్‌లో..

తాడ్వాయి: ఎర్రాపహాడ్‌లోని పోలింగ్ బూత్‌లను క్రిస్టీనా జెడ్ చోంగ్తూ తనిఖీ చేశారు. ఓటరు లిస్టులో మార్పులు, చేర్పుల గురించి తెలుసుకున్నారు. మరణించిన వారిపేర్లను తొలగించడానికి వారి పూర్తి వివరాలను సేకరించి ఫాంలో నింపాలని సూచించారు. ఆమె వెంట కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఆర్డీవో ప్రభాకర్, తహసీల్దార్ సునీత, ఆర్‌ఐ లక్ష్మణ్, బూత్‌లెవల్ అధికారులు ఉన్నారు.

మున్సిపల్ కార్మికుల సమ్మె నోటీస్

కామారెడ్డి టౌన్: డిమాండ్‌లను సాధించుకునేందుకు వచ్చేనెల 8వ తేదీ నుంచి సమ్మె చేయనున్నట్లు మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి కే.రాజనర్సు తెలిపారు. మంగళవారం మున్సిపల్ మేనేజర్‌కు సమ్మె నోటీస్‌ను అందజేశారు. కార్మికులను రెగ్యులర్ చేయాలని, పీఎఫ్ బకాయి డబ్బులు చెల్లించాలని డిమాండ్ చేశారు. అక్టోబర్ 3వ తేదీన చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని చేపట్టి సీడీఎంఏ కార్యాలయాన్ని ముట్టడిస్తామన్నారు. కార్యక్రమంలో యూనియన్ కామారెడ్డి జిల్లా అధ్యక్షుడు ప్రభాకర్, నాయకులు మహబూబ్ అలీ, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి యోగా పోటీలకు ఎంపిక

రామారెడ్డి: రెడ్డిపేట హైస్కూల్‌లో స్కూల్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న బద్దం అనిల్ కుమార్ జాతీయ స్థాయి యోగా పోటీలకు ఎంపికయ్యారు. ఈనెల 22 నుంచి 24 వరకు రంగారెడ్డి జిల్లా కడ్తాల్ పిరమిడ్ ధ్యాన కేంద్రంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి యోగా చాంపియన్‌షిప్‌లో 35 నుంచి 45 ఏళ్ల విభాగంలో అనిల్ కుమార్ సత్తా చాటి ద్వితీయ స్థానంలో నిలిచారని జిల్లా యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీరాంరెడ్డి తెలిపారు. దీంతో ఆయనను జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేశారని పేర్కొన్నారు.

'మహిళలు ఆర్థికంగా ఎదగాలి'



కామారెడ్డి క్రైం: మహిళలు ఆర్థికంగా ఎదిగినపుడే కుటుంబాలు బాగుంటాయని డీఆర్‌డీవో సాయన్న పేర్కొన్నారు. జిల్లాలో 22 మండలాలతో 2016లో ప్రారంభమైన జిల్లా మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో మంగళవారం ఏడో వార్షిక మహాసభను డీఆర్‌డీవో కార్యాలయంలో నిర్వహించారు. ప్రతి మండల సమాఖ్య నుంచి ముగ్గురు సభ్యుల చొప్పున పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీఆర్‌డీవో మాట్లాడుతూ మహిళా సంఘాలు సీఐఎఫ్, బ్యాంకు, స్త్రీనిధిలాంటి రుణాలు పొంది ఆదాయాన్ని మెరుగుపర్చుకోవాలని సూచించారు. అనంతరం జిల్లా సమాఖ్య నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా రాజమణి, కార్యదర్శిగా డి.శోభ, కోశాధికారిగా సుతారి లక్ష్మి ఎన్నికయ్యారు.

గోదావరి జలాల కోసం ఉద్యమ బాట

- జలసాధన సమితి ఆధ్వర్యంలో 1న రౌండ్ టేబుల్ సమావేశం
- కాళేశ్వరం 22వ ప్యాకేజీ పనులు వెంటనే చేపట్టాలని డిమాండ్

సాక్షి, కామారెడ్డి: కామారెడ్డి ప్రాంతానికి సాగునీరు అందించే కాళేశ్వరం 22వ ప్యాకేజీ పనులను వెంటనే చేపట్టాలని డిమాండ్ చేస్తూ జలసాధన సమితి ఆధ్వర్యంలో ఉద్యమానికి శ్రీకారం చుడుతున్నారు. ఒకటో తేదీన జిల్లా కేంద్రంలోని కర్షక్ బీఈడీ కాలేజీలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించాలని నిర్ణయించారు. ఈ విషయాన్ని జలసాధన సమితి కన్వీనర్ జి.జగన్నాథం, కో కన్వీనర్లు వై.వెంకట్రాంరెడ్డి, పి.అంజయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2005 నుంచి గోదావరి జలాల సాధన కోసం ఈ ప్రాంత రైతాంగం ఎన్నో ఉద్యమాలు చేసిందని పేర్కొన్నారు. అప్పటి సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి గోదావరి జలాలను కామారెడ్డి ప్రాంతానికి అందిస్తామని హామీ ఇచ్చి నిధులు మంజూరు చేయడంతో పాటు పనులు ప్రారంభించారని తెలిపారు. నీళ్లు, నిధులు, నియామకాల కోసం పోరాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రం ఏర్పడి తొమ్మిదేళ్లు గడచినా కామారెడ్డి ప్రాంతానికి గోదావరి నీళ్లు రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పాలకుల పక్షపాత ధోరణి వల్లే కామారెడ్డి ప్రాంతానికి నీరందడం లేదని, అదే మల్లన్నసాగర్‌కు నీళ్లు వెళ్లాయని పేర్కొన్నారు. ప్రాజెక్టుల రీడిజైన్ పేరుతో ప్రాణహిత- చేవెళ్ల ప్రాజెక్టు పేరును కాళేశ్వరంగా మార్చినా కామారెడ్డి ప్రజల సాగునీటి కష్టాలు మాత్రం తీరలేదని పేర్కొన్నారు. 22వ ప్యాకేజీ పనులు పెండింగ్‌లో పెట్టి రైతాంగానికి అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. ఈనెల 17న జలసాధన సమితి ప్రతినిధులు పనులను పరిశీలించి ఉద్యమానికి కార్యాచరణ రూపొందించారని పేర్కొన్నారు. అందులో భాగంగానే అక్టోబర్ 1న జిల్లా కేంద్రంలోని కర్షక్ బీఈడీ కాలేజీలో రౌండ్‌టేబుల్ సమావేశం ఏర్పాటు చేశామని, సమావేశానికి ఇంజినీర్లు, మేధావులు హాజరవుతారని తెలిపారు. సమావేశానికి రైతులతోపాటు రాజకీయ పార్టీల ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు తరలిరావాలని కోరారు.

'అన్ని వర్గాల అభ్యున్నతే ధ్యేయం'


ముదిరాజ్ సంఘం ఫంక్షన్ హాల్‌ను ప్రారంభిస్తున్న స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి

బాన్సువాడ: అన్ని వర్గాల అభ్యున్నతే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం బీర్కూర్‌లో ముదిరాజ్ సంఘ భవనం, ఫంక్షన్ హాల్, గాండ్ల సంఘం భవనం, కుర్మ సంఘం భవనం, బాబూ జగ్జీవన్‌రాం భవనం, లింగాయత్ కమ్యూనిటీ భవనం, మైనారిటీ ఫంక్షన్ హాల్‌లను స్పీకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో నిర్మించిన డబుల్ బెడ్ రూం ఇళ్లపై కొందరు కాంగ్రెస్ నాయకులు ఆరోపణలు చేస్తున్నారన్నారు. ఎక్కడా అవినీతి జరగలేదని, కావాలంటే ఎంబీ రికార్డులు చూసుకోవచ్చని పేర్కొన్నారు. పేదల భూములు కబ్జా చేసిన కాంగ్రెస్ నాయకులు అవినీతి గురించి మాట్లాడడం సిగ్గు చేటన్నారు. నియోజకవర్గంలో బాన్సువాడ, వర్ని, చందూర్, మోస్రా, రుద్రూర్ మండలాల రూపురేఖలు మార్చామని, త్వరలో బీర్కూర్, పొతంగల్, కోటగిరి మండలాల రూపురేఖలు మారుస్తామని పేర్కొన్నారు. ఒక్క బీర్కూర్ మండల కేంద్రానికే రూ.20 కోట్ల నిధులు మంజూరు చేశామని, అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి, జెడ్పీటీసీ స్వరూప, ఎంపీపీ రఘు, ఏఎంసీ చైర్మన్ ద్రోణవల్లి అశోక్, మాజీ జెడ్పీటీసీ ద్రోణవల్లి సతీష్, నాయకులు శశికాంత్, సాయిలు, ఆరిఫ్, అవారి గంగారాం, దుంపల రాజు, నారాయణ, యాట వీరేశం పాల్గొన్నారు.

బిచ్కుంద ఆస్పత్రికి మహర్దశ!

- వంద పడకలతో ఏరియా ఆస్పత్రిగా అప్‌గ్రేడ్
- వసతుల కల్పనకు రూ.26 కోట్లు మంజూరు
- హర్షం వ్యక్తం చేసిన ఎమ్మెల్యే సింధే


బిచ్కుంద ప్రభుత్వ ఆస్పత్రి భవనం

సాక్షి, కామారెడ్డి: జుక్కల్ నియోజకవర్గంలోని బిచ్కుంద మండల కేంద్రంలోగల 30 పడకల కమ్యూనిటీ హెల్త్ సెంటర్(సీహెచ్‌సీ)ని వంద పడకలతో ఏరియా ఆస్పత్రిగా అప్ గ్రేడ్ చేశారు. ఈ మేరకు వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కార్యదర్శి ఎస్ఏఎం రిజ్వీ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. తెలంగాణ వైద్య విధాన పరిషత్ ఆధీనంలో ఉన్న బిచ్కుంద సీహెచ్‌సీని వంద పడకలకు పెంచాలని స్థానిక ఎమ్మెల్యే హన్మంత్‌సింధే వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావుతోపాటు ముఖ్యమంత్రి కేసీఆర్‌ను పలుమార్లు కోరారు. ఆయన విజ్ఞప్తిని పరిశీలించిన ప్రభుత్వం ఆస్పత్రి స్థాయి పెంచుతూ ఉత్తర్వులు జారీ చేసింది. ఆస్పత్రిలో మౌలిక వసతుల కల్పనకు రూ.26 కోట్లు మంజూరు చేసింది. జిల్లాలో మారుమూల ప్రాంతం కావడంతో పాటు నియోజకవర్గంలోని నాలుగైదు మండలాల ప్రజలకు కూడలిగా ఉన్న బిచ్కుందలో ఏరియా ఆస్పత్రిని ఏర్పాటు చేయడం ద్వారా ఈ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుతాయని భావిస్తున్నారు. ఇక్కడ వైద్యులు లేకపోవడంతో రోగులు వైద్య సేవలకోసం బాన్సువాడకు వెళ్లాల్సి వచ్చేది. సీహెచ్‌సీని ఏరియా ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేయడంతో అన్ని విభాగాల వైద్యులు అందుబాటులో ఉండే అవకాశాలున్నాయి. దీంతో బాన్సువాడ, నిజామాబాద్‌కు వెళ్లాల్సిన ఇబ్బందులు తొలగిపోతాయని స్థానికులు భావిస్తున్నారు. బిచ్కుంద సీహెచ్‌సీని వంద పడకలతో ఏరియా ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేయడంపై స్థానిక ఎమ్మెల్యే హన్మంత్‌సింధే హర్షం వ్యక్తం చేశారు. సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

'ఆయిల్‌పామ్ సాగును ప్రోత్సహించాలి'


మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్

కామారెడ్డి క్రైం: జిల్లాలో ఆయిల్‌పామ్ సాగుకు అనువైన వాతావరణం ఉన్నందున రైతులను ప్రోత్సహించాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ ఏఈవోలకు సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లో వ్యవసాయ, ఉద్యాన, ఆయిల్‌పామ్ పరిశ్రమల అధికారులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో ఈ ఏడాది 5 వేల ఎకరాలలో ఆయిల్‌పామ్ సాగు చేయాలన్న లక్ష్యం నిర్దేశించుకోవాలన్నారు. ప్రతి వ్యవసాయ విస్తరణాధికారి తమ క్లస్టర్ పరిధిలో అవగాహన సదస్సులు నిర్వహించి, కనీసం 50 ఎకరాలలో ఆయిల్‌పామ్ పండించేలా చూడాలన్నారు. ఆయిల్ పామ్‌లో అంతర పంటలుగా పత్తి, వేరుశనగ, మొక్కజొన్న, బొప్పాయి, అరటి, కూరగాయలు సాగు చేసుకోవడం ద్వారా అదనపు ఆదాయం సమకూర్చుకోవచ్చన్న విషయంపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ఎకరం విస్తీర్ణంలో వరి సాగుకు అవసరమయ్యే నీటితో 34 ఎకరాలలో ఆయిల్‌పామ్ సాగు చేయవచ్చన్నారు. సమావేశంలో ఉద్యానశాఖ జనరల్ మేనేజర్ మల్లేశ్వరరావు, జిల్లా ఉద్యాన అధికారి విజయభాస్కర్‌రెడ్డి, జిల్లా వ్యవసాయాధికారి భాగ్యలక్ష్మి, ఏఈవోలు, ఉద్యాన అధికారులు పాల్గొన్నారు.

ప్రధాని సభకు లక్ష జన సమీకరణ

- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి


మోదీ సభ కోసం ఏర్పాట్లను పరిశీలిస్తున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, బీజేపీ నాయకులు

సుభాష్‌నగర్: నిజామాబాద్‌లో వచ్చేనెల 3న నిర్వహించే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సభను విజయవంతం చేయాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం నిజామాబాద్ నగరంలోని బస్వాగార్డెన్‌లో ఉమ్మడి నిజామాబాద్, జగిత్యాల, నిర్మల్ జిల్లాల పార్టీ పదాధికారుల సమావేశాన్ని నిర్వహించారు. మోదీ సభకు జన సమీకరణ, వివిధ అంశాలపై కిషన్‌రెడ్డి సమీక్షించారు. అనంతరం కిషన్‌రెడ్డి మాట్లాడుతూ వచ్చేనెల 3న నిజామాబాద్‌లోని ప్రభుత్వ గిరిరాజ్ కళాశాల మైదానంలో ప్రధాని మోదీ బహిరంగ సభ ఉంటుందన్నారు. సభ నుంచి పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతారని పేర్కొన్నారు. సభకు లక్ష మందికి పైగా ప్రజలను సమీకరించాలని సూచించారు. అధికారిక కార్యక్రమం అయినప్పటికీ బహిరంగ సభతో ప్రధాని మోదీ ఎన్నికల ప్రచార సభకు శ్రీకారం చుడతారని తెలిపారు. ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్, నిజామాబాద్ జిల్లాలలో అన్ని స్థానాల్లో కాషాయ జెండా ఎగురవేస్తామన్న ధీమా వ్యక్తం చేశారు. దక్షిణ తెలంగాణలోనూ పార్టీ బలపడుతోందని, రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని పేర్కొన్నారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రేమేందర్‌రెడ్డి, ఎంపీ అర్వింద్ ధర్మపురి, మాజీ ఎమ్మెల్యేలు ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, యెండల లక్ష్మీనారాయణ, రాష్ట్ర కార్యదర్శి పల్లె గంగారెడ్డి, నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు బస్వా లక్ష్మీనర్సయ్య, కామారెడ్డి జిల్లా అధ్యక్షురాలు అరుణతార, ఆయా నియోజకవర్గాల నేతలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

'తప్పు చేస్తే శిక్ష తప్పదు'



మద్నూర్(జుక్కల్): చట్టాలను ఉల్లంఘించి తప్పులు చేస్తే ఎంతటి వారికైనా శిక్ష తప్పదని బాన్సువాడ డీఎస్పీ జగన్నాథ్ రెడ్డి పేర్కొన్నారు. సుల్తాన్‌పేట్‌లో మంగళవారం కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమం నిర్వహించారు. డీఎస్పీ ఆధ్వర్యంలో గ్రామంలోని 102 ద్విచక్ర వాహనాలు, ఐదు ట్రాక్టర్లు, ఒక ఆటోను పోలీసులు పరిశీలించారు. అనంతరం డీఎస్పీ మాట్లాడుతూ.. రోడ్డుపై వెళ్లేటప్పుడు ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ కచ్చితంగా పెట్టుకోవాలన్నారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. చిన్న పిల్లలకు, డ్రైవింగ్ రాని వారికి వాహనాలు ఇవొద్దన్నారు. చట్టాలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. బిచ్కుంద సీఐ కృష్ణ, మద్నూర్ ఎస్సై కృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు వైద్య పరీక్షలు



నిజాంసాగర్(జుక్కల్): అచ్చంపేట మోడల్ హాస్టల్ విద్యార్థినులు వైరల్ ఫీవర్ బారినపడడంతో వైద్యారోగ్యశాఖ అధికారులు మంగళవారం వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. జలుబు, దగ్గు, జ్వరంతో బాధపడుతున్న విద్యార్థినులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. జిల్లా జీసీవో కో-ఆర్డినేటర్ ఉమారాణి హాస్టల్‌ను సందర్శించి వివరాలు తెలుసుకున్నారు. వార్డెన్ సరోజని, వైద్యుడు రోహిత్, ఆరోగ్య కార్యకర్తలు ఫర్హానా, సునీత తదితరులు పాల్గొన్నారు.

భిక్కనూరు : కంచర్లలో భిక్కనూరు ఆయుర్వేద వైద్యశాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్యశిబిరం విజయవంతమైంది. 142 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. వైద్యాధికారి వెంకటేశ్వర్లు, సిబ్బంది ప్రసాద్, మహమూద్, సర్పంచ్ చంద్రం పాల్గొన్నారు.

పీడీఎస్ బియ్యం సీజ్



ఎల్లారెడ్డి: శివాపూర్‌లోని వీరభద్ర రైస్‌మిల్‌లో పీడీఎస్ బియ్యాన్ని పట్టుకుని సీజ్ చేసినట్లు ఎస్సై గణేష్ మంగళవారం తెలిపారు. రైస్‌మిల్‌లో పీడీఎస్ బియ్యాన్ని తక్కువ ధరకు కొని ప్రభుత్వానికి సీఎంఆర్ కింద పెడుతున్నారన్న సమాచారం మేరకు రైస్‌మిల్‌పై దాడులు చేయగా ఆరు క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం ఉన్నట్లు గుర్తించామన్నారు. రైస్‌మిల్ యజమాని గౌత సంతోష్‌ను ఈ విషయం గురించి అడగ్గా.. పీడీఎస్ బియ్యాన్ని కొన్నట్లు ఒప్పుకున్నారని, సంతోష్‌పై కేసు నమోదు చేసి పీడీఎస్ బియ్యాన్ని సీజ్ చేసినట్లు ఎస్సై తెలిపారు. పీడీఎస్ బియ్యం కొంటున్నట్లు తెలిస్తే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.

బోర్లంలో గుండెపోటుతో ఒకరి మృతి



చంద్రశేఖర్ (ఫైల్)

బాన్సువాడ రూరల్: మండలంలోని కాంగ్రెస్ పార్టీ బోర్లం గ్రామ అధ్యక్షుడు కాదిరెడ్డి చంద్రశేఖర్(46) గుండెపోటుతో మంగళవారం ఉదయం మృతి చెందాడు. కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కాసుల బాలరాజు, సీనియర్ నాయకుడు మాసాని శ్రీనివాస్‌రెడ్డితో పాటు గ్రామ పెద్దలు పర్వంరెడ్డి, నర్సింహు లు, శ్రీనివాస్‌రెడ్డి, దేవేందర్‌రెడ్డి, జనార్ధన్‌రెడ్డి, పుట్టి లక్ష్మణ్, కాదిరెడ్డి రమేశ్, సతీశ్‌గౌడ్, మంద సాయి లు అంత్యక్రియల్లో పాల్గొని మృతదేహానికి నివాళి అర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు.



పర్యావరణాన్ని కాపాడే రీతిలో ప్రత్యేక ఆకృతుల్లో అపార్ట్‌మెంట్ కమ్యూనిటీ, యువ జన సంఘాల మండ పాలు, ఇళ్లలో ప్రతిష్ఠించిన వినాయక విగ్రహాల కు సంబంధించి 'సాక్షి' సెల్ఫీలు ఆహ్వానిస్తోంది. ఆసక్తిగలవారు వినాయక ప్రతిమలతో సెల్ఫీలు దిగి కింది నంబరుకు వాట్సాప్ చేయగలరు.

పంపించాల్సిన వాట్సాప్ నం..
96039 39111



శ్రీ సాయి గణేష్ యూత్, అయ్యప్పనగర్, కామారెడ్డి



శివప్రసాద్, బ్రహ్మం, కాకతీయనగర్, కామారెడ్డి



దీప, దేవునిపల్లి



అవంతిక, ప్రియాంక, ఎల్లారెడ్డి



ఆర్యవైశ్య సంఘం, దోమకొండ



సౌమ్య, కామారెడ్డి



సంధ్య, అభినయ, చిన్నమల్లారెడ్డి



బాలగణేష్ మండలి, పెద్దకొడప్గల్



చిన్నారుల గణేశ్ మండలి, మద్నూర్



శ్రీధర్‌వీర్, కామారెడ్డి



గురురాఘవేంద్రకాలనీ గణేష్ మండలి, కామారెడ్డి



కృష్ణప్రసాద్, రఘువరుణ్, ప్రశాంత్, బొప్పాజివాడి



బాల్‌రాజ్, బాన్సువాడ



కార్తిక్, శ్రీకాంత్, శ్రీను, ఉత్తనూర్



భాను, అరుణ్, అనిల్, పుష్ప, కామారెడ్డి



సాత్విక్‌రెడ్డి, కామారెడ్డి



సంజయ్, భిక్కనూర్



ఎం.రమ్య, న్యాన్సి, ఆరాధ్య, ఘనపూర్(ఎం)



సంధ్య, కృష్ణ, బొప్పాజీవాడి, గాంధారి



నర్సింలు, బాలేష్, రాజంపేట



గల్ఫ్ యూత్, భిక్కనూరు



యామిని, వీర్‌కుమార్, బిచ్కుంద



విద్యాసాగర్, ఎల్లారెడ్డి



సంఘమేశ్వర్, సదాశివనగర్



రేహన్ష్, కామారెడ్డి



రుత్విక, రుషికేష్, దేవునిపల్లి

నాగిరెడ్డిపేటలో చైన్‌స్నాచర్ల హల్‌చల్

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మండలంలో ఇద్దరు చైన్‌స్నాచర్లు సోమవారం సాయంత్రం మహిళలపై దాడులకు పాల్పడి హల్‌చల్ చేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. మండలంలోని ఎర్రారం గ్రామశివారులో మహిళమెడలో నుంచి 3 తులాల బంగారు పుస్తెలతాడును అపహరించగా, నాగిరెడ్డిపేట శివారులో కాలినడకన వెళ్తున్న మరో మహిళ మెడలో నుంచి గొలుసును అపహరించే యత్నం చేశారు. సదరు మహిళ ప్రతిఘటించడంతో దుండగులు పరారయ్యారు.

ఎర్రారం గ్రామానికి చెందిన పిల్లి లక్ష్మయ్య తన మేనకోడలు నీరుడి వసంతతో కలిసి సోమవారం సాయంత్రం బైక్‌పై ఎల్లారెడ్డి నుంచి స్వగ్రామానికి వస్తుండగా ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు లక్ష్మయ్య బైక్‌ను ఆపి రాడ్‌తో చేశారు. దీంతో వసంత మెడలో ఉన్న 3 తులాల బంగారు పుస్తెలతాడును ఎత్తుకెళ్లారు. అంతకుముందు నాగిరెడ్డిపేటకు చెందిన నీరుడి యశోధ అదేగ్రామానికి చెందిన మరోమహిళతో కలిసి గోపాల్‌పేట నుంచి స్వగ్రామానికి కాలినడకన వస్తుండగా వెనక నుంచి ఇద్దరు దుండగులు బైక్‌పై వచ్చి మహిళలపై కారం నీళ్లు చల్లి యశోద మెడలో ఉన్న బంగారు గొలుసును అపహరించేయత్నం చేశారు. దీంతో యశోద ప్రతిఘటించడంతో దుండగులు పరారయ్యారు. ఎర్రారంలో చోరీకి యత్నించినవారే నాగిరెడ్డిపేటలోనూ చోరీయత్నానికి పాల్పడి ఉంటారని పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. రెండు ఘటనలపై కేసు నమోదు చేసినట్లు ఇన్‌చార్జి ఎస్‌హెచ్‌వో వీరయ్య తెలిపారు.



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

రేషన్ లబ్ధిదారులకు వేలిముద్ర కష్టాలు

– ఆధార్ సెంటర్ల వద్ద బారులు



రామారెడ్డి/కామారెడ్డిటౌన్: రేషన్ షాపులలో రేషన్ కార్డులో పేర్లు ఉన్న సభ్యులందరి వేలిముద్రలను బయోమెట్రిక్ ద్వారా స్వీకరిస్తున్నారు. వేలిముద్రలు రానివారికి ఆధార్ సెంటర్‌ల ద్వారా వేలిముద్ర లేదంటే ఐరిస్ స్వీకరిస్తున్నారు. వేలిముద్ర పెట్టకపోతే వచ్చే నెల ఎక్కడ బియ్యం కట్ చేస్తారో అనే ఆందోళనలో లబ్ధిదారులు క్యూ కడుతున్నారు. అయితే దీనిపై రామారెడ్డి తహసీల్దార్ రోజాను స్పందించారు. ఉన్నతాధికారుల నుంచి ఎలాంటి ఆదేశాలు లేవని వేలిముద్ర పెట్టడానికి సమయం ఉందని, వచ్చే నెల నుంచి బియ్యం తొలగిస్తారనేది నిజం కాదన్నారు.

కరుడుగట్టిన నేరస్తుడి అరెస్ట్

- దోపిడీ, హత్య నేరాల్లో జీవిత ఖైదు అనుభవిస్తున్న జుల్ఫీసింగ్
- ఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి

కామారెడ్డి క్రైం: దోపిడీ, హత్య నేరాల్లో జీవిత ఖైదు శిక్ష అనుభవిస్తూ పెరోల్‌పై బయటకొచ్చి, జైలుకు వెళ్లకుండా తిరుగుతున్న ఓ కరుడుగట్టిన నేరస్తుడిని కామారెడ్డి పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. అతనితో పాటు బైక్ చోరీల కేసులో మరో నలుగురిని అరెస్ట్ చేసి మొత్తం 51 బైకులను స్వాధీనం చేసుకున్నారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ వివరాలు వెల్లడించారు. కామారెడ్డి పరిసర ప్రాంతాల్లో తరచూ బైక్ చోరీలు జరుగుతుండడంతో నిందితులను పట్టుకునేందుకు డీఎస్పీ ప్రకాశ్ ఆధ్వర్యంలో పోలీసు శాఖ నాలుగు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసింది. మంగళవారం ఉదయం కామారెడ్డిలోని హైదరాబాద్ రోడ్‌లో మూడు బైక్‌లపై అనుమానాస్పదంగా తిరుగుతున్న ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని విచారించగా బైక్ చోరీల ఉదంతం బయటపడింది. నిందితులను మహారాష్ట్రకు చెందిన జుల్ఫీసింగ్, కామారెడ్డికు చెందిన షేక్ యూనుస్, బాన్సువాడకు చెందిన షేక్ సోహెల్, హైదరాబాద్‌కు చెందిన సోహెల్ అలీ, బంజారాహిల్స్‌కు చెందిన చాపల అంజప్పగా గుర్తించారు. కామారెడ్డి, నిజామాబాద్, కరీంనగర్, హైదరాబాద్, మెదక్‌లో, పలు ప్రాంతాల్లో మొత్తం 51 బైకులను నిందితులు చోరీ చేశారు.

19వ ఏట నుంచే..

పట్టుబడిన వారిలో జుల్ఫీసింగ్ కరుడుగట్టిన నేరస్తుడు. తన 19వ ఏట నుంచే నేర ప్రవృత్తికి అలవాటు పడ్డాడు. జాల్నా ప్రాంతానికి చెందిన అతడిపై మహారాష్ట్రలో అనేక దొంగతనాలు, దోపిడీ కేసులున్నాయి. బాన్సువాడకు చెందిన మహిళను పెళ్లి చేసుకుని కొంత కాలం ఇక్కడే ఉండి నేరాలకు పాల్పడ్డాడు. 2014లో మహారాష్ట్రలోని అమరావతి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉన్న ఓ జ్యువెలరీ షాప్‌లో చోరీకి యత్నించాడు. అడ్డుకోబోయిన యజమాని విజయ్ థోవర్‌ను కాల్చి చంపాడు. ఈ కేసులో అతడికి యావజ్జీవ శిక్ష పడగా 2021లో కరోనా సోకడంతో పెరోల్‌పై ఇంటికి వచ్చాడు. గడువు పూర్తయినప్పటికీ జైలుకు వెళ్లకుండా తప్పించుకుని తిరుగుతున్నాడు. జుల్ఫీ సింగ్‌తో పాటు బైక్ చోరీల ముఠాను అరెస్ట్ చేసిన కేసులో చాకచక్యంగా వ్యవహరించిన పట్టణ ఎస్‌హెచ్‌వో నరేశ్, సీసీఎస్ సీఐ మల్లేశ్ గౌడ్, ఎస్సైలు అనిల్, ఉస్మాన్, ఏఎస్సైలు రాజేశ్వరరావు, శ్రీనివాస్, హెడ్ కానిస్టేబుళ్లు సురేందర్, కిషన్, శ్రీనివాస్ గౌడ్, శ్రీనివాస్, కానిస్టేబుళ్లు గణపతి, జొన్నల రవి, రాజేందర్, శ్రావణ్, ప్రవీణ్, శ్రీనివాస్, మైసయ్య, విశ్వనాథ్, రాజు నాయక్, నరేశ్, లక్ష్మణ్, రవికుమార్, రమేశ్, నవీన్, భాస్కర్, మహేందర్, కళ్యాణ్ గౌడ్, ఐటీ కోర్ మహేందర్, డ్రైవర్ శేషు నాయక్‌ను ఎస్పీ అభినందించారు.



జుల్ఫీసింగ్

దివ్యాంగుల సంక్షేమానికి ప్రాధాన్యత

- అదనపు కలెక్టర్ చిత్రామిశ్రా

నిజామాబాద్‌నాగారం: దివ్యాంగుల సంక్షేమానికి జిల్లా యంత్రాంగం అధిక ప్రాధాన్యత ఇస్తుందని అదనపు కలెక్టర్ చిత్రామిశ్రా అన్నారు. అదనపు కలెక్టర్ చాంబర్‌లో మంగళవారం జిల్లా మహిళా, శిశు, దివ్యంగుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో దివ్యాంగుల హక్కుల చట్టంపై జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. దివ్యాంగులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు. కమిటీ సభ్యులు పలు అంశాలను ప్రస్తావించగా, అదనపు కలెక్టర్ వాటిపై సానుకూలంగా స్పందించారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో దివ్యంగులకు కోసం నెలకొల్పిన సంరక్షణ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సమావేశంలో జిల్లా సంక్షేమ శాఖ అధికారిణి రసూల్ బీ, అధికారులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ చిత్రామిశ్రా

386 మొబైల్ ఫోన్ల రికవరీ



కామారెడ్డి క్రైం: పోగొట్టుకున్న మొబైల్ ఫోన్‌లను గుర్తించే సీఈఐఆర్ పోర్టల్ వచ్చిన తర్వాత జిల్లాలో ఇప్పటివరకు 386 మొబైల్ ఫోన్లను రికవరీ చేసినట్లు ఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. జిల్లా పోలీసు కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడారు. బాన్సువాడ టౌన్ పోలీస్ స్టేషన్‌లో అత్యధికంగా 87 మొబైల్ ఫోన్లను గుర్తించి బాధితులకు అప్పగించామన్నారు. మొబైల్ ఫోన్‌లను గుర్తించడంలో విశేషంగా కృషి చేసిన బాన్సువాడ సీఈఐఆర్ ఆపరేటర్ రాజేశ్వర్‌ను శాలువాతో సత్కరించారు. నగదు ప్రోత్సాహకం, ప్రశంసాపత్రాలను అందజేశారు.

రేపు వైన్ షాపులు బంద్

ఖలీల్‌వాడి: గణేశ్ నిమజ్జనం సందర్భంగా జిల్లాలోని వైన్స్‌లు, బార్‌లు ఈ నెల 28న ఉదయం 6 నుంచి 29న ఉదయం 10 గంటల వరకు మూసి ఉంటాయని సీపీ సత్యనారాయణ మంగళవారం తెలిపారు. కమిషనరేట్ పరిధిలో వైన్స్ షాపులను తెరిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

క్రైం కార్నర్

చివరి చూపు దక్కొద్దని..

- వృద్ధుడి ఆత్మహత్యాయత్నం
- అడ్డుకున్న స్థానికులు

రెంజల్(బోధన్): కన్న వారికి కడసారి చూపు దక్కొద్దని గోదావరిలో దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వృద్ధుడిని స్థానికులు కాపడగా పోలీసులు కౌన్సెలింగ్ నిర్వహించి కుటుంబీకులకు అప్పగించారు. సిరిసిల్ల జిల్లా డంభీరావ్‌పేట్ మండలానికి చెందిన లచ్చిపేట మల్లయ్యకు నలుగురు కూతుళ్లు. వారి వివాహాలు చేసినా వృద్ధాప్యంలో ఎవరూ పట్టించుకోకపోవడంతో రెంజల్ మండలం కందకుర్తి వద్ద గోదావరి నదిలో దూకి ఆత్మహత్య చేసుకునేందుకు వచ్చాడు. వంతెన వద్ద అనుమానంగా తిరుగుతున్న 82 సంవత్సరాల మల్లయ్యను గుర్తించిన స్థానికులు పట్టుకుని వివరాలను తెలుసుకున్నారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించడంతో ఎస్సై ఉదయ్‌కుమార్ అక్కడికి చేరుకుని స్టేషన్‌కు తీసుకొచ్చారు. కుటుంబీకులకు సమాచారం అందించి కౌన్సెలింగ్ ఇచ్చి పంపించారు.

బోలెరో వాహనం టైర్లు చోరీ

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ పట్టణంలోని పాత రిజిస్ట్రేషన్ కార్యాలయ సమీపంలో రాత్రి పార్కింగ్ చేసిన బోలెరో గూడ్స్ వాహన టైర్లను గుర్తుతెలియని దుండగులు ఎత్తుకెళ్లారు. సోమవారం రాత్రి పార్కింగ్ చేయగా మంగళవారం ఉదయం చూడగా టైర్లు కనిపించక పోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితుడు తెలిపాడు.

ట్రాలీ ఆటో బోల్తా



ఇందల్వాయి: డిచ్‌పల్లి నుంచి మండలకేంద్రానికి వస్తున్న ట్రాలీ అదుపు తప్పి బోల్తాపడింది. డ్రైవర్‌నిద్రమత్తులో ఉండడంతో ఆటో సైన్‌బోర్డును ఢీకొని బోల్తాపడింది. ఘటనలో తిర్మన్‌పల్లికి చెందిన ఆటో డ్రైవర్ శంకర్ స్వల్పగాయాలైనట్లు స్థానికులు తెలిపారు.

స్వగ్రామానికి మృతదేహం



కిరణ్ (ఫైల్)

మోపాల్: మండలంలోని న్యాల్‌కల్‌కు చెందిన కిరణ్ (21) అనారోగ్యంతో బాధపడుతూ ఖత్తర్‌లో మృతి చెందగా, మృతదేహం మంగళవారం స్వగ్రామానికి చేరింది. ఉపాధినిమిత్తం మూడు నెలల క్రితం ఖత్తర్ వెళ్లిన కిరణ్, 20 రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. కిరణ్ మృతదేహాన్ని చూసి తల్లిదండ్రులు బోరున విలపించారు.

వేర్వేరు ఘటనల్లో పలువురి మృతి

నస్రుల్లాబాద్: మండల శివారులోని అటవీ ప్రాంతంలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో బాన్సువాడ లైన్‌ఇన్‌స్పెక్టర్ గజేందర్(45)మృతి చెందాడు. వర్ని నుంచి బాన్సువాడ వైపు ద్విచక్ర వాహనంపై వస్తుండగా ఎదురుగా వచ్చిన మరో బైక్ ఢీకొనడంతో కిందపడిపోయాడు. అదే సమయంలో వచ్చిన లారీ గజేందర్‌పై నుంచి వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మరో ఇద్దరికి తీవ్ర గాయాలు కాగా స్థానికులు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

మనస్తాపంతో యువతి ఆత్మహత్య

నందిపేట్ (ఆర్మూర్): నందిపేట్ మండల కేంద్రంలోని రాజనగర్ దుబ్బ ప్రాంతానికి చెందిన చిత్తరి లక్ష్మి(21) మనస్తాపంతో ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై రాహుల్ తెలిపారు. అదే ప్రాంతానికి చెందిన జమున తన డబ్బులు దొంగిలించిందనే భావనతో లక్ష్మితో గొడవ పడింది. దీంతో ఇంట్లో ఎవరూ లేని సమయంలో లక్ష్మి మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకుంది. లక్ష్మి భర్త ప్రదీప్ కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

వాగులో మృతదేహం లభ్యం



రాంచందర్ (ఫైల్)

మాక్లూర్: మండలంలోని చిక్లి శివారులోని చెక్‌డ్యామ్‌లో మంగళవారం ఓ వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు ఎస్సై సుధీర్‌రావు తెలిపారు. నవీపేటకు చెందిన ఈర్నాల రాంచందర్ (32) జన్నేపల్లి బ్రిడ్జి వద్ద ఈ నెల 21న చేపలు పట్టేందుకు వెళ్లాడు. ప్రమాదవశాత్తు వాగులో పడి నీటి ప్రవాహంలో కొట్టుకుపోయాడు. విషయం గుర్తించిన పలువురు కుటుంబ సభ్యులకు తెలుపగా గాలింపు చర్యలు చేపట్టారు. మంగళవారం రాత్రి చిక్లి శివారులోని చెక్ డ్యామ్ వద్ద మృతదేహం లభ్యమైందని ఎస్సై తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

రైలు ప్రమాదంలో ఆర్మీ జవాన్..

జైపాల్‌రెడ్డి (ఫైల్)

రాజంపేట: బస్వన్నపల్లి గ్రామానికి చెందిన ఈగ జైపాల్‌రెడ్డి(45) అనే ఆర్మీ జవాన్ సోమవారం రాత్రి ట్రైన్ ప్రమాదంలో మరణించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. విధి నిర్వహణలో భాగంగా సోమవారం రాత్రి పది గంటల ప్రాంతంలో రాజస్థాన్ అల్వార్ జంక్షన్ స్టేషన్ నుంచి ఢిల్లీకి వెళ్లేందుకు రైలు ఎక్కుతుండగా ప్రమాదశాత్తు కాలుజారి రైలు కిందపడి చనిపోయినట్లు తెలిపారు. దీంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

చికిత్స పొందుతూ జీపీ కార్మికుడు..

రెంజల్(బోధన్): నీలా గ్రామ పంచాయతీలో వాటర్‌మన్‌గా పనిచేస్తున్న కార్మికుడు గుట్క పోశెట్టి(48) చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందినట్లు ఎస్సై ఉదయ్‌కుమార్ తెలిపారు. ఇటీవల కడుపునొప్పితో బాధపడుతున్న పోశెట్టి ఆస్పత్రుల్లో చూయించినా నయం కాకపోవడంతో ఈ నెల 21న ఇంట్లో పురుగుల మందు సేవించాడు. గమనించిన కుటుంబీకులు ఆసుపత్రిలో చూయించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. అంత్యక్రియల నిమిత్తం పంచాయతీ కార్యదర్శి మృతుడి భార్య సుజాతకు జీపీ నిధుల నుంచి రూ. 10 వేలు అందించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

వదల్‌పర్తిలో వివాహిత..

సుశీల(ఫైల్)

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మండలంలోని వదల్‌పర్తి గ్రామానికి చెందిన చాకలి సుశీల(43) ఎల్లారెడ్డిపేటలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారంరాత్రి మృతిచెందింది. పోలీసుల కథనం ప్రకారం.. సుశీల కొంతకాలంగా కడుపునొప్పితో బాధపడుతోంది. ఈ నెల 22న ఇంట్లో ఎవరూలేని సమయంలో పురుగులమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. గమనించిన కుటుంబీకులు ఎల్లారెడ్డిపేటలోని ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతురాలి భర్త అంజయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఇన్‌చార్జి ఎస్‌హెచ్‌వో వీరయ్య తెలిపారు.

విద్యుదాఘాతంతో యువకుడు..

ప్రవీణ్ (ఫైల్)

మోపాల్: న్యాల్‌కల్ గ్రామంలో సున్నం ప్రవీణ్(30) విద్యుదాఘాతంతో మంగళవారం రాత్రి మృతిచెందాడు. గ్రామస్తుల తెలిపిన వివరాల ప్రకారం.. ప్రవీణ్ వ్యవసాయంతో పాటు ట్రాక్టర్ నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. నిమజ్జనం సందర్భంగా గణపతిని తరలించేందుకు ట్రాక్టర్‌ను ఏర్పాటు చేశాడు. తన ఇంటి దాబాపై ఏర్పాటు చేసిన గణపతిని తీసుకొచ్చేందుకు వెళ్లిన ప్రవీణ్ విద్యుత్‌తీగలపై అడుగుపెట్టడంతో విద్యుదాఘాతానికి గురయ్యాడు. గమనించి కూతురు తల్లికి సమాచారం అందించగా ప్రవీణ్ భార్యకు సైతం విద్యుదాఘాతం సంభవించి దూరం పడిపోయింది. గమనించిన కుటుంబ సభ్యులు ప్రవీణ్‌ను ఆసుపత్రి తరలించగా మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

కుంటలో పడి యువకుడు..

ఈస్సాబేగ్ (ఫైల్)

బోధన్ టౌన్ (బోధన్): రాకాసిపేట్‌లోని కర్ణం కుంటలో ఈస్సాబేగ్ (22) అనే యువకుడు మృతి చెందినట్లు సీఐ ప్రేమ్‌కుమార్ తెలిపారు. ప్రమాదవశాత్తు కుంటలో పడి మృతి చెంది ఉంటాడని అనుమానం వ్యక్తం చేస్తున్నట్లు పేర్కొన్నారు. మృతుడి అన్న షేక్‌గౌస్‌బేగ్ ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసినట్లు తెలిపారు.